# అనుదినం ఆదివారమయితే ?

అబ్బబ్బా ! ఆరున్నర కావొస్తోంది ! అయినా శ్రీవారికింకా ఇల్లూ, ఇల్లాలూ గుర్తుకు రాలేదు కాబోలు !"

సాయంత్రం ఆరుగంటలు దాటినప్పట్నుంచీ విజయలో అసహనం, క్షణక్షణానికీ ఎక్కువై పోతోంది. భాస్కర్ కిష్టమైన రోజ్ కలర్ వాయిల్ చీరె, నల్లని నేత జాకెట్టు వేసుకున్న విజయకు-భర్తరాక ఆలస్యమౌతున్నకొద్దీ, ఆ డ్రెస్ కూడా దుర్భరంగా తోచసాగింది !

ఏం ఆఫీసులో ? ఏం వుద్యోగాలో !? ఉదయంలేచి ఒక్క నిముషం భార్యతో సరదాగా కబుర్లు చెప్పేందుకు పైముండదు గదా ? నిద్రలేవటం, వెనకాల ఎవరో తరుముకు వస్తున్నట్లు షేవింగూ, స్నానమూ, డ్రెస్సింగ్ ముగించి, 'అన్నం పెట్టెయ్ విజీ ! నేత్వరగా ఆఫీసుకు వెళ్ళాలి !' అంటూ కదను తొక్కెయ్యటం !

తనకు మాత్రం క్షణం తీరికేదీ ? తొమ్మిదిన్నరలోగా యిద్దరు పిల్లల్నీ స్కూలుకుపంపి, వంటపని ముగించేసరికి సర్కస్ ఫీట్స్ చేసినట్లవుతుంది ! అటు ఆయనగారు ఆఫీసుకూ ఇటు తను యిల్లు సర్దుకోవటం... కాస్సేపు పత్రికలు తిరగవెయ్యటంతో యిట్టే మూడున్నరా అవుతుంది ! మళ్ళీ వంట....వార్పూ....ఐదున్నరనుంచీ ఆయనగారికోసం నిరీక్షిస్తూవుంటే ఏ ఏడుగంటలకో తిన్నగా వస్తారు ! ఆ సమయంలో ఆరిపోయిన తన సహనం ఎంతలేసి కేకలైనా వేయాలని చూస్తుంది కానీ, అలసిపోయిన ఆయనగారి ముఖం చూస్తుంటే మాత్రం హృదయం మందగిస్తోంది !

ఇక అప్పట్నుంచీ రేడియో కార్యక్రమాలు విని, పిల్లలతో ముచ్చట్లుచేసి-వాళ్ళు నిద్రపోయాక భోజనానికి వస్తారు! భోజనం అయ్యా

కాగానే ఫైళ్లు ముందేసుక్కూర్చుని, ఏ పదిగంటలకో పడకవేపు వస్తారు; అర్ధరాత్రిలో సరదాగా కబుర్లాడుకునే దేముందీ?

"ఏమిటి విజయా? నీలో నువ్వే ఏదో గొణుక్కుంటూ గుణింతాలు వల్లెవేస్తున్నట్లున్నావ్?"

ఉలిక్కిపడింది విజయ! తన ఎదురుగా, వరండా మెట్లమీద నిల్చుని ఎదురింటి వరలక్ష్మి తనకేసి చూస్తూ నవ్వుతోంది!

"ఉహూఁ ఏదో ఆలోచిస్తూ! రా వరలక్ష్మీ! కూర్చో!"

"కూర్చోవటానికి రాలేదు నేను! మా శ్రీవారికి గుత్తివంకాయ కూర తినాలని బుద్ధౌంతోందిట! ఉదయం వంకాయలు అమ్మొచ్చినా, పని మాలీ ఒద్దు పొమ్మన్నాను, కూరగాయలు యింట్లో వున్నాయని. నువ్వేమైనా కొన్నావేమో, ఓ నాలుగు కాయలు యిస్తే, రేపు కొని పంపేద్దామని...."

"ఆ! వున్నాయిలే యిస్తా రా!" కూరల బుట్ట తెచ్చింది విజయ. మంచి కాయలు నాలుగు ఏరుకుని...."అయినా పనీపాటా లేకుండా మగాడు యింట్లో కూర్చుంటే పెళ్ళాన్ని యిలాగే వేపుకుతింటాడు!" విసుక్కుంటూ వెళ్ళింది వరలక్ష్మి!

వరలక్ష్మి వెళ్ళినవేపే చూస్తూ నిల్చుండిపోయింది విజయ! వరలక్ష్మి భర్త వుద్యోగం చెయ్యటంలేదు! ఓ చిన్న బట్టలషాపు పెట్టుకున్నాడు! అస్తమానూ హాయిగా యింట్లోనే వుంటాడు! రోజు కొక్కసారి షాపుకు వెళ్ళి ఆ రోజు ఖాతాలు, కొట్లో నిలవా, బిల్ పుస్తకమూ అన్నీ చెకప్ చేసుకువస్తాడట! అస్తమానూ వరలక్ష్మి, అతగాడూ కబుర్లాడుకుంటూ, నవ్వుకుంటూ, త్రుళ్లుతూ, తిరుగుతుంటారు.

"విజీ! స్థంభం తలగడగా చేసుక నిద్రపోగలవన్నమాట నువ్వు?"

గడ్డం మునివ్రేళ్ళతో ఎత్తుతూ ప్రశ్నిస్తున్న భాస్కర్ నవ్వుతున్న కళ్ళు, ఆమె మత్తును వదలగొట్టేశాయి!

"ఏమిటా పరవశం?"

"పరవశంకాదు — తమ రాకకోసం నిరీక్షణ!"

"అదీకథ! నిరీక్షణలో యింతటి అందం, ఆనందం వుంటాయని నాకు తెలియదుసుమా!" నవ్వుతూ అన్నాడు భాస్కర్.

"ఆ! ఆ! అందం, ఆనందం .... ఉదయంనుంచీ నిముషమొక యుగంలా తమరికోసం నిరీక్షిస్తుంటే, తిన్నగా చచ్చే చివరి క్షణాలలో వున్న భక్తుడికి భగవంతుని సాక్షాత్కారంలా, తమరు ఊడిపడ్డారు! రోజూ యిదేతంతు!" కోపంగా అతగాడి చేతులు తన భుజాలమీదనుంచి తొలగించింది విజయ.

భాస్కర్ పెద్దగా నవ్వాడు.

"భలే విజీ....భలే వుపమానం చెప్పావ్! చివరిక్షణాల్లో వుండే భక్తుడికి భగవంతుని సాక్షాత్కారం లానా? అవునోయ్! అందాకా భగవంతుడు ఎందుకు ప్రత్యక్షంకాడో నీకు తెలుసా?"

"ఊహూఁ!"

"భక్తునిలో ఎన్నో కోర్కెలు మిగిలి వుండొచ్చు. ముందస్తుగా ప్రత్యక్షం అయిన భగవంతుణ్ణి చూచి..."భక్తా నీకావల్సిన వరం కోరుకో!" అని ఆయన అనడం తరువాయిగా —

"ఫలాన వీధిలో ఫలానా నెంబరు యింట్లోని ఒకటోక్లాస్ అమ్మాయిని తెచ్చిపెట్టు" అనో,

"రేపు తెల్లారుఝామున నా బదులుగా నువ్వు క్యూలో నిల్చుని పాలు తెచ్చిపెట్టు" అనో.

"బ్లాకులోఅయినా నాలుగు రూపాయలు ఎక్కువైనా ఫర్వాలేదు నాలుగు కిలోల పంచదార పట్టుకురా!" అనో పురమాయించవచ్చు....మరి పిలిస్తే పలికే దేవుడుంటే ఎంత భక్తుడికైతే మాత్రం గ్లామరే ముంటుందీ ?"

అంతటి కోపంలోనూ విజయ కిలకిల నవ్వింది ..

"అంచేతే మైడియర్ విజీ ! కోర్కెలన్నీ చచ్చాక, మనిషిపూర్తిగా చావబోతూండగా, ఇక తనను ఐహిక సంబంధమైన ఏ కోర్కెలూ అత గాడుకోరడు, కోరలేడు అనే భరోసా కలిగాక, అప్పుడు సాక్షాత్కరిస్తాడు దేవుడు...."

"బావుంది లెండి ! తమర్ని నే నలాటి అసాధ్యపు కోర్కెలు ఏం కోరుతున్నానో మరి ?" చిరుకోపంతో అంది విజయ.

"లేదనుకో ! అస్తమానూ నువ్వు కోరినప్పుడల్లా నీ ఎదురుగా నేనుంటే, నీకీ నిరీక్షణా, కాస్తంత అలకా, ఆ అలక పోగొట్టేందుకు నా హైరాన....ఈ సీనూ, సీక్వెన్సూ, స్వీటూ ఎలా వుంటాయి చెప్పు ? అందుకే అన్నాడో మహానుభావుడు.... "విరహముకూడా సుఖమే కాదా ? నిరతము చింతన మధురము కాదా ?" అని ఆఫీసులో కూర్చునిఎప్పుడు నా విజి వడిలో వాలుతానో ? అని నేనూ, ఇంటిదగ్గర మా శ్రీవారెప్పు డొసారో ? అని నువ్వూ తియ్యగా...."

"ఉపన్యాసాలు చాలుగానీ, స్నానం చేద్దురుగాని పదండి !" నవ్వుతూ మందలించింది విజయ ...

"చిత్తం!" అనుసరించాడు భాస్కర్....ఈ కొద్ది క్షణాలూ హృదయంలో అలాగే దాచుకుని, కాలం అలాగే ఆగిపోవాలనుకుంటుం దలాటి సమయాలలో విజయ మనసు!

హఠాత్తుగా ప్రశాంతమైన తటాకంలో రాయి పడింది! రిట్రెంచ్ మెంట్ ఘాతం విరుచుకుపడింది!

"విజీ! నా ఉద్యోగం పోయింది!" అన్నాడు బాధగా భాస్కర్ ఆ రోజు సాయంత్రం.

"ఫర్వాలేదు. బెంగపడకండి! ఇద్దరి కిద్దరం పొదుపుగానే గడిపాం కదా? బ్యాంకిలో వున్న డబ్బు అవసరానికి ఆదుకుంటుంది...."

"అదికాదు విజీ! ఉద్యోగం లేకుండా చేతులు ముడుచుకుని ఎలా కూర్చోగలను? ఎలా తోచి చస్తుంది నాకు? బ్యాంకులో వున్న రెండొందలూ ఎన్ని నెలలు వస్తుంది?" దిగాలుగా జుత్తులో చేతులు దూర్చి కూర్చున్నాడు....

అతగాడి వెనకగా నిల్చునివున్న విజయ....లోలోపల నవ్వుకుంది! "ఏంమగాళ్ళో? ఎంచక్కా యిన్నాళ్ళకయినా యింటిపట్టున స్థిమితంగా కూర్చుని యిల్లాలితో హాయిగా కబుర్లాడుకుంటూ గడిపే అవకాశం వచ్చిందని పొంగిపోక, ఇలా పుట్టి మునిగినట్లు పోజ్ వేస్తారేమిటో! అందామె మనస్సు.

"భాస్కర్.... భాస్కర్!" వరండాలో శ్రీనివాసరావు గొంతుక బిగ్గరగా వినిపించింది....

"వస్తున్నా!" చివ్వునలేచి వెళ్ళాడు భాస్కర్.

తలుపువారగా నిల్చుని వింటోంది విజయ.

"భాస్కర్! రిట్రెంచ్ మెంట్! మన మెడలమీదేపడాలా? దాదాపు ఏడుపు గొంతుకతో వెక్కిళ్ల మినహా గా వాపోతున్నాడు శ్రీనివాస్.

"ప్చ! అంతా ఒకేజాతి!" లోలోపల విసుక్కుంది విజయ.

"ఊ!" బాధగా మూలిగాడు భాస్కర్!

"సీనియారిటీ, సిన్సియారిటీ వగైరాలు పరిశీలించి ఎప్పుడో మన ముఖాల్న ఉద్యోగాలు పారేస్తారట దొరవారు! అది మనం బ్రతికుండగా జరుగుతుందంటావా? రెండు చేతుల మధ్యా తల యిరికించుకున్నాడు శ్రీనివాస్.

భాస్కర్ పలకలేదు.

"అబ్బబ్బ ఈయనగారొచ్చి, శ్రీవారి బుర్రమరింత చెడగొట్టేసేలా వున్నాడు!" తిట్టుకుంది విజయ!

"భాస్కర్! ఉన్న కాస్త పొలమూ పుట్రా, ఆస్తీ పాస్తీ, సర్వం అమ్మి మన చదువులు చెప్పించారు మన అమ్మా నాన్నలు! మనమేదో ఉద్యోగాలు చేసి అంతకు పదింతలు ఆస్తులూ, పాస్తులూ సంపాదిస్తామని వాళ్ళు ఆశపడి ఎన్నో ఆశలు పెంచుకుని వుంటారు! తీరా ఈనాడు తమ కొడుకులు ...అటు కాయకష్టం చెయ్యలేని అర్భకులుగా, యిటు పెళ్ళాం బిడ్డలన్ని పోషించుకోలేని అశక్తులుగా తయారైనారని తెలిస్తే ....? ఊహూఁ! ఏం చెయ్యాలో పాలుపోవటంలేదు భాస్కర్! ఆస్తులా లేవు! ఉద్యోగాలు పోయాయి! వృత్తివిద్యలా రావు! ఈనాడు మన భార్యా బిడ్డలూ....తల్లిదండ్రులూ . . . మనమూ . . ." యిక ఆపుకోలేక భోరు మన్నాడు శ్రీనివాస్.

భాస్కర్ మెల్లిగా స్నేహితుడి భుజంతట్టి అనునయించాడు. "అలా బెదిరిపోకు శ్రీనూ! ఏదో మార్గం దొర్కపోదు. కంగారుపడకు!" అనునయిస్తూ. . . ధైర్యం చెబుతూ సాగనంపాడు.

* * * * *

హుషారుగా కూనిరాగం తీస్తూ వంట చేస్తోంది విజయ. ఈ రోజు తన భర్త తన ఎదురుగా...ఒక్క క్షణం తనని వదలకుండా యింట్లోనే వున్నారు! యింతకంటే హాయి మరేమిటి?

వంటయింట్లో పీటవాల్చు కూర్చునివున్న భాస్కర్ విజయను పరీక్షగా చూస్తున్నాడు.

గబగబ ఉల్లిపాయలు తరిగి గిన్నెలో పడేసింది విజయ.

"అరె...అరె...సరిగా కడక్కుండా...పొట్టుపోకుండా ఏమిటా దూకుడూ? ఈ రోజు నాకు ఆఫీసుకు వెళ్లే పనికూడా లేదు... ఎందుకా హడావుడి?" అన్నాడు భాస్కర్.

"త్వరగా వంట ముగించుక వస్తాను. ఎంచక్కా కబుర్లాడుకుంటూ కూర్చుందాం!" అంది విజయ హుషారుగా.

"అందుకని మట్టీ, చెత్తా, చెదారం తినేద్దామా?"

"చెత్తా చెదారమా?" కోపంగా అంది విజయ!

"ఊ! తరిగిన ఉల్లిపాయల్ని - సరిగా పొట్టు ఒలవకుండా పులుసులో పారేసావ్? పోనీ తరిగే ముందైనా కడిగేవా!"

"రోజూ యిలాగే చేస్తున్నాను వంట! అదే అమృతంగా వుందంటూ తింటూనే వున్నారు! ఈ రోజు కొత్తగా నాకేమిటి నేర్పుతారు?" విసుగ్గా అంది విజయ!

"హతోస్మి! నాలుగేళ్లుగా యిలాటి అపరిశుభ్రమైన భోజనమే నాకు పెడుతున్నావా? నాకు తెలీదు సుమా? ఊహూం తెలియలేదు! తెలుసుకోవటానికి అవకాశం వుండేది కాదు! రోజూ ఈ సరికి ఆఫీసుకు వెళ్ళే ప్రయత్నంలో 'గేలప్' లో వుండేవాణ్ని కదూ?"

విజయకు చిరాకేసింది. ఏదేనా మంచి కబుర్లు మొదలెట్టక, తీరుబడిగా వంటయింట్లో కూర్చుని, తననీ తన వంటనీ విమర్శిస్తున్నారు!

"మీరు వెళ్ళి మీ రూంలో కూర్చోండి. నాకు చేతనైనట్లు పని తెములుకు బయటపడతాను!"

"హూఁ!" లేచి వెళ్తున్న భాస్కర్‌కు రూంలో మూలగా చేటల్లో పెట్టివున్న పొట్లాలు కనిపించాయి!

"ఇవేమిటి విజీ?"

"మెంతులూ ఆవాలు, పప్పులూ వగైరాల్లెండి."

"ఇది మన యిల్లా లేకుంటే, ఒక పూట వుండి, మరుపూట ఖాళీ చేసి వెళ్ళే సత్రమా?" కోపంగా అరిచాడు.

"ఏం?"

తెప్పించిన వస్తువులు సర్దుకోనక్కర్లా! అవలా పొట్లాలుగానే విరజిమ్మి వుండాలా?"

విజయ కోపం తారాస్థాయి నందుకుంది. "నిన్న సాయంత్రం తెప్పించాను. బాగుచేసుకోవటానికి టైంలేకపోయింది. తర్వాత తీరికయ్యాక డబ్బాలలో పోసుకుంటాను. అయినా మీకు వాటితో ఏం పని?"

"నాకులేదు. కానీ పిల్ల లిద్దరికీ వుంటుంది వాటితో పని! యింకా స్పేపట్లో వాళ్ళిద్దరూ అవన్నీ ఏకం చేసారంటే..."

భాస్కర్ మాట పూర్తి కాకుండానే విజయ గట్టిగా అరిచింది. "అబ్బబ్బ! మీకెందు కా గొడవల్నీ? యిన్నాళ్ళూ, యిన్నేళ్ళూ నే చేసుకుంటున్న పనులన్నీ మీకీ ఒక్కరోజులో మహా దారుణంగా కన్పిస్తున్నాయల్లే వుంది!"

"ఇల్లింత నరకంగా ఈదుచుకొస్తున్నావని నాకూ యిన్నాళ్ళూ, యిన్నేళ్ళూ తెలియదు !"

నెల రోజులు తిరక్కముందే విజయకు పిచ్చెక్కినంత పనైంది! అస్తమానూ భాస్కర్ యింట్లోనే వుంటున్నాడు.

"బయట తల పెట్టాలంటే అవమానం విజీ! అందుకే షికార్లు, క్లబ్బు, ఒకటేమిటి అన్నీ మానేసాను !" అంటాడు.

పోనీ హుషారుగా కబుర్లాడుకుందా మనుకుంటే, అస్తమానూ ఏం కబుర్లుంటాయి ?

ఒకరికొకరు అనుక్షణం ఎదురుగా వుండటంతో ఒకరిలోని లోపాలు మరొకరికి కొండంతలుగా కనిపిస్తున్నాయి !

"ఆ శిగ ఏమిటి విజీ ? అసహ్యంగా ?"

"ఈ శిగ మీకెంతో నచ్చిందన్నారు 'ఆ'రోజు సాయంత్రం ?"

"ఏరోజో కాస్సేపు చూస్తే బావుందన్నానని, రోజూ ఆ శిగే వేస్తే ఏ అక్కదేవతో నడిచి వస్తోన్నట్లు అనిపిస్తోంది !"

"ఇదెక్కడి చీరె ?"

"మీరేగా బావుందని కొన్నారూ !"

"శివ శివా ! ఈ పెద్ద పెద్ద పువ్వులూ, చెట్లూ, కొమ్మలూ ? సజీవమైన చెట్టొకటి ఇక్కడుందని, ఓ మంద మేకలో, గొర్రెలో మనింట్లోకి రావచ్చు !"

"పిల్లల్ని బొత్తిగా మురిపెం చేసేస్తున్నావు విజీ ?"

"మీరేగా కొడితే, తిడితే వాళ్ళ లేతమనసులు నొచ్చుకుంటాయి గటాని అంటూ ఉపన్యాసాలిచ్చేవారు ?"

“ అవుననుకో ! అస్తమానూ యింట్లో ఇలా ముద్దుచేసి, నేను ఆఫీసునుంచి వచ్చిన సమయంలో ఎప్పుడో ఓ దెబ్బ వేస్తావు కాబోలు. నాకు జాలీ, పిల్లలకు మురిపెం ఎక్కువై పోయాయి ! ”

“ నెయ్యేనా ఒలకబోశావు ? ”

“ ఊ ! కొద్దిగా ! ”

“ కొద్దిగా ! దిక్కు లేకుండా సంపాదించుకువచ్చి పడేస్తుంటే, కొంచెమేం ? ఎంత ఒలకబోసినా అడిగే దిక్కు లేకుండా వుండేదనుకో ! ఈ నాడు నాకు ఉద్యోగం లేదు సంపాదన లేదు. . . ”

విజయ భోరున ఏడుస్తోంది ! అస్తమానూ భర్త యింట్లోనేవుంటే, తనూహించిన తీపు విరిగి, చేదుగా, వెర్రి చేదుగా మారిపోతోంది వాతావరణం ! మనస్సు !

“ ఈ చీరె ఎంత బావుంది విజీ ! ” అంటూ అలసిన ముఖంతో, ఆఫీసునుంచి రాగానే తనకేసి పరకాయించి చూచి, బుగ్గమీద చిటికేసిన భాస్కర్. . .

“ ఈ శిగలో నువ్వెంత బావున్నావూ ? అబ్బబ్బ ! ఎంతగా పరుగెత్తుకువచ్చి నీ వడిలో వాలుదామన్నా పని పూర్తయితేనా ? ” అంటూ తనను ఉక్కిరి బిక్కిరి చేసిన భాస్కర్. . .

“ అబ్బబ్బ ! ఈ ఆదివారం మధ్యాహ్నం అపురూపమైంది విజీ ! యీ కాస్సేపు ఏదో టిఫిన్ నెపంతో నువ్వు బిజీగా వుండటం నే సహించలేను ! రా ! హాయిగా కబుర్లాడుకుంటూ కూర్చుందాం. . . ” అంటూ తనని హృదయానికి హత్తుకుని ఆ ఆదివారం పోతే మరోవారం రాదేమో నన్నంత గాభరాపడిపోయే భాస్కర్.

యీనాడు రోజూ ఆదివారాలు కావటంతో ... ఎడమొహం పెడ మొహాలతో, చీదరింపులతో, వ్యంగ్యాలతో, విసుర్లతో! భగవాన్...!

మళ్ళీ జీవితానికి సోమ, మంగళ... బుధ ... వరుసగా వారాలు రావా? యింతకిర్రితంలా అతగాడు హడావిడిగా ఆఫీసు కెళ్ళటం.... తను నిరీక్షిస్తూ నిల్చోవటం....

*   *   *

"విజీ! గ్లాడ్ న్యూస్!

"ఏమిటి?"

"నాకు ఉద్యోగం వచ్చింది."

"నిజం?" పోయిన ప్రాణం లేచివచ్చినట్లు అడిగింది విజయ.

"నిజం! రేపట్నుంచే జాయినవ్వాలి! అయితే యిందులో రిట్రెంచ్‌మెంటు బాధల్లేవులే! ప్రైవేటు కంపెనీ, అంచేత ఏకంగా ఊస్టింగో, ప్రమోషనో .... ఏదో ఒకటి మాత్రమే యిస్తారు. సగం సగంగా చంపకుండా!"

"పోన్లెండి! ఏదో ఒకటి!" అంది విజయ తేలికపడ్డ హృదయంతో!

మరునాడు...హడావుడిగా భాస్కర్ ఆఫీసుకెళ్ళాడు. సాయంత్రం నాలుగు, ఐదు...ఆరు...

నిరీక్షిస్తున్న విజయలో ఆనందం ఉరకలు వేస్తోంది...

("సుహాసిని" జనవరి '68)